www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 11 డిసెంబర్ 2022
5
చిత్తూరు

నేడు చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆదివారం మోర్ధాన్‌పల్లి వద్ద గల టీఎస్ పబ్లిక్‌స్కూల్‌లో చెక్కుముకి సంబరాలు నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక నాయకులు అరుణ శివప్రసాద్, సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంచేలా వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నాగేశ్వరరావు, సుదర్శన్ ఆచారి, యుగంధర్ బాబు, హేమాద్రి పాల్గొన్న ఉన్నట్లు పేర్కొన్నారు.

మాండూస్ వణుకు

- జిల్లా వ్యాప్తంగా వర్షాలు
- స్తంభించిన జనజీవనం
- నిలిచిపోయిన రాకపోకలు
- అల్లాడిన జనం

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

మాండూస్ తుపాను జిల్లాను వణికించింది. చలిగాలులకు తోడు, వర్షం వల్ల జిల్లా మొత్తం తల్లడిల్లింది. అన్ని మండలాల్లో తుపాను ప్రభావం కనిపించింది. రహదారులు కొట్టుకుపోవడం వల్ల పలుప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వృక్షాలు నేలకొరిగాయి. వేరుశనగ, నువ్వులు వంటి పంటలు దెబ్బతిన్నాయి. ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లింది. చెరువుల్లోకి భారీగా నీరుచేరింది. రిజర్వాయర్లు పొంగిపొర్లాయి. అధికంగా రామకుప్పంలో..

బంగాళాఖాతంలో ఏర్పడిన మాండూస్ తుపాను ప్రభావం జిల్లాలో స్పష్టంగా కనిపించింది. శనివారం సాయంత్రం ఆరుగంటల వరకు అందిన సమాచారం ప్రకారం జిల్లా వ్యాప్తంగా 32 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. అత్యధికంగా రామకుప్పంలో 55 మిమీ, వి.కోటలో 50 మిమీ, శాంతీపురంలో 40.4 మిమీ లెక్కన వర్షపాతం నమోదయ్యింది. అత్యంత తక్కువగా విజయపురంలో 0.04 మిల్లీమీటర్లు పడింది. శనివారం నగరి ప్రాంతంలో విస్తారంగా కురిసిన వర్షాలు శనివారం ఎక్కువగా కుప్పం నియోజకవర్గంలో నమోదయ్యింది. అలాగే పుంగనూరులోని సోమలలో కూడా వర్షం ఎక్కువగా కురిసింది.

నేలకొరిగిన వృక్షాలు.. తెగిన కరెంటు తీగలు..

భారీగా వీస్తున్న గాలుల వల్ల భారీ వక్షాలు నేలకొరిగాయి. 149 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. కొన్నిప్రాంతాల్లో కరెంటు తీగలు తెగిపోతున్నాయి. దీంతో విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటివరకు విద్యుత్‌శాఖకు తొమ్మిది లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. అలాగే పలు లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చరింది. సోమలలో నిర్మాణంలో ఉన్న వంతెన కొట్టుకుపోవడంతో కలికిరికి రాకపోకలు స్తంభించాయి.

328 మందికి పునరావాసం

మండూస్ తుపాను ప్రభావం వల్ల జిల్లావ్యాప్తంగా ఆరు మండలాల్లో 11 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న 328 మందికి ఆశ్రయం కల్పించారు. సోమల, పాలసముద్రం, నింద్ర, విజయపురం, నగరి, ఎస్ఆర్ పురం మండలాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లోని వసతి గృహాల్లో, పాఠశాల్లో వసతి ఏర్పాటు చేశారు.

ఎన్టీఆర్ జలాశయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

వాగులు, వంకల వద్ద గట్టి పర్యవేక్షణ : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: తుపాన్ నేపథ్యంలో ఈనెల 11వ తేదీ వరకు వర్షాలు పడే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హరి నారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాగులు, వంకలు, కాజ్‌వేల వద్ద నీటి ప్రవాహంను బట్టి రాకపోకలు జరగకుండా ముందస్తుచర్యలు చేపట్టాలన్నారు. అలాగే వాగులు, వంకలు, చెరువులు, జలాశయాల వద్ద నీటి ప్రవాహంకు సంబంధించి నిరంతర పర్యవేక్షణ అవసరమని ఏపీఎస్పీడీసీ ఎల్‌అధికారులు అప్రమత్తంగా ఉండి లైన్లు కట్ అయిన చోట వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు.

కాజువేల వద్ద అత్యంత జాగ్రత్త :జెసి

జిల్లాలో తుపాను నేపథ్యంలో భారీగా వర్షాలు కురుస్తున్నాయని తగిన భద్రతాచర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. శనివారం మధ్యాహ్నం జాయింట్ కలెక్టర్ జిల్లాలోని అందరూ ఎంపీడీఓలు, తహాశీల్దార్లుతో టెలికాన్ఫరన్స్ నిర్వహించారు. జెసి మాట్లాడుతూ తుపాన్ ప్రభావం మరో 24గంటలు కొనసాగే అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయిలో సరైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు క్షేత్రస్థాయిలో సమన్వయంతో కలసి పనిచేసి ఎటువంటి నష్టం కలుగకుండా చూడాలన్నారు. నదులు, చెరువులు, కాజువేల వద్ద పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని 31 మండలాల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఎన్టీఆర్ జలాశయం, నీవానదిని పరిశీలించిన కలెక్టర్

చిత్తూరు నగరపరిధిలోని నీవానది నీటిఉధతిని, పెనుమూరు ఎన్టీఆర్ జలాశయంను జిల్లాకలెక్టర్ ఎం.హరినారాయణన్ పరిశీలించారు. తుపాన్ నేపథ్యంలో చిత్తూరు తేనెబండ, సంతపేట వద్ద నీవానది పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నీటి ప్రవాహ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కల్వర్టు వద్ద మునిసిపాలిటీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. నీటి ప్రవాహనికి ఎటువంటి అడ్డంకులు లేకుండా చెత్త, ఇతరవ్యర్ధాలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. నీవా నది పరిసరప్రాంతప్రజలనుసురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఎన్టీఆర్ జలాశయం మొత్తం నీటి నిల్వ సామర్థ్యం

110 ఎంసిఎఫ్‌టీ కాగా, ప్రస్తుతం 88 ఎంసిఎఫ్‌టి వరకు కలదని ఇరిగేషన్ ఎస్ఈ విజయ్ కుమార్ రెడ్డి కలెక్టర్ వివరించారు. అనంతరం పి. కొత్తకోట చవటపల్లి బ్రిడ్జి క్రింద నీరు నిల్వ ఉండడంతో ఆప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్ వాహనదారులు, ప్రజలు ఎవ్వరూ ఆ దారిలో వెళ్లకుండా ప్రమాద సూచికలను ఏర్పాటు చేసి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు గా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కమిషనర్ విస్తత పర్యటన

లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిపై సమీక్ష - అధికారులకు మార్గనిర్దేశం

తుపాన్ ప్రభావంతో కురుస్తున్న భారీవర్షాలు, వీస్తున్న గాలుల నేపథ్యంలో నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ శనివారం ఉదయం నగరంలో విస్తతంగా పర్యటించారు. ఈదురు గాలులు, జోరు వర్షంలోనే కమిషనర్ నగరంలోని పలు కీలక ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. గాలులు, వర్షాలతో ఎక్కడ ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తిన సత్వరం స్పందించి పరిస్థితులను చక్కదిద్దాలని నగరపాలక అధికారులను ఆదేశించారు. తొమ్మిదో వార్డు పరిధిలో చెన్నారెడ్డి కాలనీలో రోడ్డుపై చెట్టు కూలడంతో నగరపాలక అధికారులు, రెస్క్యూ సిబ్బంది సత్వరం స్పందించి తొలగించారు. కమిషనర్ వెంటనే ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. నగరంలో లోతట్టు, ముంపు ప్రాంతమైన వీరభద్రకాలనీల్లో పరిస్థితిని పరిశీలించారు. నీవానదిలో నీటిమట్టంపై ఎప్పటికప్పుడు అంచనా వేసుకొని అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కమిషనర్ ఇరువారం వద్ద నీవానదిలో నీటి

సంతపేట బ్రిడ్జిని పరిశీలిస్తున్న నగర కమిషనర్

ప్రవాహాన్ని పరిశీలించారు. నగర పాలక పరిధిలో అన్ని వార్డు సచివాలయంలో పరిధిలో వార్డు కార్యదర్శులు వర్షాల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. పారిశుద్ధ్యం, నీటి సరఫరాపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

గంగవరం మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండటంతో జనజీవనం స్తంభిస్తోంది. మూగ జీవాలు కొట్టాలకే పరిమితమయ్యాయి. పాడి రైతులు పశువులకు మేత తీసుకురావడానికి సైతం ఇబ్బందులు పడుతున్నారు. వరి పంట పూర్తిగా నీటిపాలవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

కార్వేటినగరం మండలంలో విస్తారంగా వర్షాలు పడటంతో వాగులు పొంగాయి దీంతో పంటలు మునిపోయాయి. కొటార్వేడు పరిసర ప్రాంతాల్లో రైతులు సాగు చేసిన మిరప పంట, సీడీ కండిగ, కోదండరామాపురం, టీకేఎంపేట, యర్రమరాజుపల్లి, గాజంకె గ్రామాల్లో వేరుశెనగ పంట నీటి మునిగింది.

బైరెడ్డిపల్లి మండలంలోని భారీ వర్షం కారణంగా బేలుపల్లి పంచాయతీ పరిధిలోని రోడ్లు జలమయం అయ్యాయి. దీంతో రాకపోకలు స్తంభించాయి.

శాంతిపురం మండలంలోని వ్యవసాయ క్షేత్రాలలో తుపాన్ కారణంగా 60 రోజుల పైబడిన దశలో ఉన్న మొక్కజొన్న గాలివాన వలన దాదాపు 10ఎకరాల్లో నీటిమునిగింది. కొలమడుగు ఒక ఎకరా వరి పూర్తిగా నీటమునిగింది. అలాగే కూరగాయల పంటలు, సొర, బీర పంటలకు కూడా తీవ్రనష్టం కలిగింది.

పూతలపట్టు మండలంలోని పి. కొత్తకోట వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి కొత్తగా నిర్మించిన 6 లైన్ 140 జాతీయ రహదారిలో సర్వీస్ రోడ్డులో నిల్వచేరిన వర్షపు నీటిలో టాటా ఏసీ మినీ వాహనం చిక్కుకుంది. స్థలాన్ని చేరుకున్న కలెక్టర్ హరినారాయణ, ఆర్డీఓ రేణుక, తహశీల్దార్ విజయ్ భాస్కర్ వర్షపు నీటిలో చిక్కుకున్న టాటా మినీ వాహనాన్ని క్రేన్ సహాయంతో బయటకు తీశారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే

చర్యలు తప్పవు: జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించే సంస్థలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్ అతిథి గహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిఎఫ్‌ఐ పై చట్టవిరుద్ధ కార్యకలాపాలు (నివారణ) యాక్ట్ 1967 ప్రకారం కేంద్ర ప్రభుత్వం తేదీ 27సెప్టెంబర్ 2022న వాటిపై నిషేధం విధించిందన్నారు. పిఎఫ్‌ఐ, దాని అనుబంధ సంస్థలపై ఐదేళ్లపాటు నిషేధం విధిస్తూ కేంద్ర హోంశాఖ ఉతర్వులు జారీ చేసిందన్నారు. యూఏపిఏ చట్టం కింద ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించినట్లు తెలిపారు. ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులను అందించడంతో పాటు యువతకు శిక్షణ ఇస్తున్నారనే ఆరోపణలపై పిఎఫ్‌ఐ కారాయాలయలపై దేశవ్యాప్తంగా భారీ ఆపరేషన్ చేపట్టారన్నారు. వందలాది మంది పిఎఫ్‌ఐ కార్యకర్తలను అరెస్ట్ చేసి. ఇటువంటి సంస్థల కార్యకలాపాలు ఎవరైనా నిర్వహించిన, ప్రోత్సహించిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యకలాపపై నిఘా ఉంచమని జిల్లాలోని పోలీసు అధికారులు అందరికి ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ఎస్పీ తెలిపారు.

వర్షం నిలిచిన వెంటనే పారిశుధ్య నిర్వహణపై దృష్టి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో 11వతేది ఉదయం వరకు ఆరంజ్ అలర్ట్ కలదని, తరువాత ఎల్లో అలర్ట్ కలదని కావున మరో 24గంటలు అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరంకలదని జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ తెలిపారు. శనివారం రాత్రి వివిధ జిల్లాలో మాండోస్ తుపానుకు సంబంధించి వివిధశాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహశీల్దార్లులు ఎంపీడీఓలతో క్షేత్రస్థాయి పరిస్థితులపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో కలిసి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం పలమనేరు కుప్పం డివిజన్‌లో వర్షపాతం ఎక్కువగా కలదని తూర్పు మండలాలలో వర్షం తగ్గుముఖం పట్టిన వంకలు, వాగులలో ప్రవహిస్తూ ఉంటుందని ఈ వంకలు వాగులు దాటే ప్రయత్నం చేయకుండా తగిన పోలీసు వారి సహకారంతో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వర్షం తగ్గిన వెంటనే పారిశుద్ధ్యం మెరుగుపరచాలని, ప్రజలకు క్లోరినేషన్ చేసిన తరువాత తాగునీరుని సరఫరా చేయాలన్నారు. పైపులు లీకేజీలు లేకుండా మరమ్మతులు చేయాలని, ప్రజలకు సురక్షిత మంచినీటి సరఫరాపై దృష్టి సారించాలని డిపిఓను, మున్సిపల్ కమిషనర్లను, ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్య ఆరోగ్యశాఖ ద్వారా సర్వేలెన్స్ చేపట్టి అవసరమైతే మెడికల్ క్యాంపులను నిర్వహించాలని డిఎంఅండ్ హెచ్‌ఓను ఆదేశించారు. అధికారులు, సిబ్బంది అందరూ వారి ప్రధాన కార్యస్థానంలో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి అన్ని వసతులు కల్పించాలనన్నారు.

397 మందికి పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తుపాను కారణంగా లోతట్టు ప్రాంతాల్లో ఆవాసాలు కోల్పోయిన జిల్లాలోని 397 మంది ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఎస్ఆర్‌పురం మండలం మూడు పునరావాస కేంద్రాల్లో 56 మంది, తవణంపల్లి మండలం- 1 పునరావాస కేంద్రం- 36 మంది, సోమల మండలం- 1, పునరావాస కేంద్రం- 57మంది, గంగవరం మండలం -1 పునరావాస కేంద్రం- 8మంది, నగరి, పాలసముద్రం విజయపురం- 8 పునరవాసకేంద్రాలు- 170 మంది, శాంతిపురంమండలం- జంగాలపల్లిలో-1 పునరావాస కేంద్రం- 60 మంది ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నారు.

ప్రజాస్వామ్యానికి పోలీసుల గొడ్డలి పోటు

ప్రజాదృష్టి

30 యాక్ట్ పేరుతో ఓవరాక్షన్
ప్రజాశక్తి చిత్తూరు ప్రతినిధి

జిల్లాలో ప్రజాస్వామ్యానికి పోలీసులు గొడ్డలిపోటు పొడుస్తున్నారు. ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఎవరు ప్రశ్నించకూడదు మాట్లాడకూడదు అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. తమ మాట కాదన్న వారిపై లాఠీలు చూపిస్తున్నారు. అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. ఇటీవల అనేక ఉద్యమాలపై వీరు ఉక్కుపాదం మోపుతున్నారు. 30 పోలీస్‌యాక్ట్ పేరుతో ప్రశ్నించే గొంతుకులను నొక్కేస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజాసమస్యలపై ప్రతిపౌరుడికి మాట్లాడే హక్కు ఉంది. రాజ్యాంగాన్ని కతీతంగా పుంగనూరు నియోజకవర్గం ఉందా అదే ప్రశ్నలు తలత్తుతున్నాయి. ఇక్కడ పోలీసులు మంత్రి మన్ననలు పొందాలని ఎక్కువగా తాపత్రయ పడుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులు అత్యుత్సాహం చూపి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారనే విమర్శలు ఎదురవుతున్నాయి.

నియోజకవర్గంలో అనేకరకాల సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని ప్రధానంగా రైతాంగం, పాలరైతులు గిట్టుబాటు ధరలేక అవస్థలు పడుతున్నారు. మరి ఇలాంటి సందర్భంలో వారి సమస్యలను ప్రస్తావించే వారి గొంతు నొక్కుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీలకు ఓరకంగా, అధికారంలోకి వచ్చిన పార్టీలకు ఒక రకంగా పోలీసులు వ్యవహరించడం రాజ్యాంగ విరుద్ధం. ప్రజాసమస్యలపై పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని రాజకీయ కతీతంగా ప్రజలకు సేవ చేయాలని రాజ్యాంగాన్ని కట్టుబడి ఉండాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కొంతమంది పోలీసులు అధికారపార్టీ నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు ఎదురవుతున్నాయి. సరైంది కాదన్నారు. ఇటీవల పుంగనూరు నియోజకవర్గంలో సమస్యలపై పోరాటం నిర్వహించేందుకు ఇక్కడ రామచంద్ర యాదవ్ ప్రయత్నిస్తే ఆయనపై పోలీసులు వైసిపి నాయకులు దాడులకు దిగారు. దీనిపైన జిల్లా వ్యాప్తంగా విమర్శలు తలెత్తాయి. అలాగే పోలీసులు ప్రభుత్వ పెద్దల పొందేందుకు జిల్లాలో అనేక ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు అనేక సమస్యలపై పోరాటం నిర్వహిస్తున్నారు. వీరిది అడుగడుగునా అడ్డుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు అర్ధరాత్రి అయినా వెంటాడుతూ షోకాజు నోటీసులు ఇస్తున్నారు. రాత్రివేళల్లో సైతం వెంటాడుతుండడంపై జిల్లా వ్యాప్తంగా విమర్శలు వెలుగుతున్నాయి. ప్రజాసంఘాలు శాంతియుతంగా పోరాటాలు నిర్వహించాలన్న పోలీసులు అనుమతులు ఇవ్వడం లేదు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటిది.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

విలేకర్ల సమావేశంలో నిందితులను చూపుతున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి, దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న సొమ్ము, వెండి, నగదు

రూ.55 లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఇటీవల గంగాధరనెల్లూరు పోలీసుస్టేషన్ పరిధిలో పాన్‌బ్రోకర్ షాపులో జరిగిన భారీ దొంగతనం కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు ఎట్టకేలకు చేధించారు. చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో చిత్తూరు రూరల్ ఈస్ట్ సీఐ మద్దయాచారి నేతృత్వంలో ఎస్సైలు అనిల్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఒకటిన్నర నెలగా దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో తిరిగి నేరస్తులకు సంబంధించిన సమాచారం సేకరించారు. ఈ క్రమంలో శుక్రవారం అందిన సమాచారం మేరకు.. చిత్తూరు ఈస్ట్ సీఐ ఆధ్వర్యంలోని టీమ్ చిత్తూరు మండలం బెంగళూరు-తిరుపతి రోడ్డులోని చెర్లోపల్లి వద్ద కేసులో ముద్దాయిలుగా ఉన్న మురుగన్, శివగురు, కరాటే మురుగా, రాజాలను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.15 లక్షల నగదు, 395 గ్రాముల బంగారు ఆభరణాలు, 6 కిలోల వెండి, నేరానికి ఉపయోగించిన 3 కార్లను మొత్తం రూ.55 లక్షలు విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఇద్దరు ముద్దాయిలు కలిసి గత 15 ఏళ్లగా వివిధ రాష్ట్రాల్లోని బ్యాంకులు, పాన్‌బ్రోకర్ దుకాణాలు, నగల దుకాణాలు, ఒంటరి ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడి భారీ మొత్తాలను చోరీ చేస్తూ పోలీసుల కళ్లుగప్పి తప్పించుకొని తిరుగుతున్నారు. వీరిలో కరాటే మురుగా తన స్థావరాన్ని ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఏర్పాటు చేసుకొని బందంతో కలిసి నేరాలకు పాల్పడి తిరిగి అక్కడకు వెళ్లి తలదాచుకొనేవాడు. వీరిపై నాలుగు రాష్ట్రాల్లో మొత్తం 42 కేసులు నమోదై పెండింగ్‌లో ఉన్నాయి. వీరు గతంలో చిత్తూరు టౌన్, ఐరాల పోలీసు స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడినట్లు తేల్చారు. తమిళనాడులోని చెంగల్‌పట్టు జిల్లా మధురాంతకం తాలూకా వైపాన గ్రామానికి చెందిన మురుగన్, శివగురు, కరాటే మురుగా, రాజాలను అరెస్టు చేయగా.. కల్లకురుచ్చికి చెందిన మణికంఠ, నల్ల మురుగా, కర్ణాటకలోని తుంకూర్ జిల్లాకు చెందిన సురేష్, సిరా, పాండిచ్చేరికి చెందిన రంజిత్, తమిళనాడులోని కల్లకురుచ్చికి చెందిన సెల్వరాజ్, పయని, వెంకటేష్, పెరుమాల్‌లు పరారీలో ఉన్నారు. అత్యంత చాకచక్యంగా కేసును ఛేదించిన చిత్తూరు రూరల్ ఈస్ట్ సీఐ మద్దయాచారి, ఎస్సై అనిల్ కుమార్, ప్రతాప్ రెడ్డి, ఐడీ పార్టీ సిబ్బందిని జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించి క్యాష్ రివార్డులు అందించారు.

87 మంది హోంగార్డుల తొలగింపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో నకిలీ డిఓలతో 87మంది హోంగార్డులుగా చేరారని ఆరోపణలపై అనంతపురం రేంజ్ డిఐజి రవి ప్రకాష్ సీరియస్‌గా తీసుకున్నారు. అక్రమమార్గంలో నకిలీ డిఓలను సృష్టించి ఉద్యోగం సంపాదించిన హోంగార్డులు ఎవరనే విషయాన్ని తేల్చేలా 2014-19 సంవత్సరాల మధ్య కాలంలో చిత్తూరు జిల్లాలో నకిలీ డిఓలు సృష్టించి 87మంది హోంగార్డులుగా విధులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి హోంగార్డుల నియామక అవకతవకలపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ప్రాథమిక విచారణలో 47 మంది హోంగార్డులు నకిలీ డివోలు సృష్టించి ఉద్యోగాల్లో చేరినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో కొందరు ఉద్యోగాలు ఇప్పిస్తామని హొంగార్డుల నుండి డబ్బులు తీసుకున్నట్లు కీలక సమాచారం సేకరించారు. హొంగార్డుల అక్రమణియామకాలపై ఎంతమంది డబ్బులు తీసుకున్నారనే విషయంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై సిఆర్ నెం.185/2022, బ/ం 420,419, 409, 468, 471 ఆర్/డబ్ల్యూ 120(బి) ×పిసి సెక్షన్ల క్రింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. తదుపరి చర్యలకు సిద్ధమయ్యారు.అక్రమంగా హొంగార్డులుగా చేరిన ఈ 87 మందిని ఉద్యోగం నుండీ తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అక్రమంపై మరింత లోతుగా దర్యాప్తు చేపట్టి అసలు విషయాలు బయటికి తీయాలని జిల్లా ఎస్పీకి డిఐజి రవి ప్రకాష్ ఆదేశించారు.

కట్టమంచి రామలింగారెడ్డికి ఘననివాళి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరుకు చెందిన ప్రముఖ విద్యావేత్త, తత్వవేత్త డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి 143వ జయంతి సందర్భంగా ఆయన సమాధి, విగ్రహం వద్ద పలువురు ఘననివాళి అర్పించారు. దేశవిదేశాల్లో చదివిన భారతదేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా అనేక కార్యక్రమాలు చేపట్టిన డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి చిరస్మరణీయుడని పలువురు కొనియాడారు. కట్టమంచి బాబి, శ్రీధర్, ప్రసాద్‌రెడ్డి, శివ, నరసింహారెడ్డి, విటల్ రెడ్డి, నాగభూషణం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి-కుప్పం: లయన్స్ క్లబ్ ఆఫ్ కుప్పం వారియర్స్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పి.ఈ.ఎస్ అర్బన్ ఆస్పత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి కుప్పం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు డా.మహేష్ తెలిపారు. కుప్పం ప్రాంతంలో లయన్స్ క్లబ్ ఏర్పాటు కుప్పం ప్రజల అవసరాలను తీర్చిచడంలో ముందుంటుందన్నారు. వైద్య శిబిరానికి సముద్రాల నితిన్ కుమార్ వారి కుటుంబ సభ్యులు భోజన సౌకర్యాన్ని కల్పించారు. 51 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 15 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ సెల్వం , కోశాధికారి సెంథిల్, డైరెక్టర్లు మతీన్, సురేష్, శివ , ప్రకాష్ , నారాయణ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కట్టమంచి రామలింగారెడ్డికి నివాళులు

ప్రజాశక్తి-పలమనేరు: ప్రముఖ విద్యావేత్త, కవి, రచయిత అయిన చిత్తూరు జిల్లాకు చెందిన కట్టమంచి రామలింగారెడ్డి జయంతిని శనివారం పలమనేరులోని తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి కళామందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తులసినాథంనాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ముసలమ్మ మరణం పుస్తకాన్ని రచించిన మేథావి రామలింగారెడ్డి అన్నారు. కవితత్వ విచారం, అర్థశాస్త్రం, వేమన లాంటి రచనలు బాగా ప్రాచుర్యం పొందాయన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపనకు, అభివద్ధికి విశేష కషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పుష్ప, అబీధాలి, సుదర్శనాచారి, భూపాల్‌రెడ్డి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-పలమనేరు: ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పలమనేరు హ్యూమన్ రైట్స్ కార్యవర్గ సభ్యులు శనివారం పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డిని కలిసి పట్టణంలోని సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. పలమనేరులోని ఎంబీటీ రోడ్డు, గుడియాత్తం రోడ్డు, బజారు వీధి, పెట్రోల్ బంక్ రోడ్డు, గుండుబావి రోడ్డులల్లో ద్విచక్రవాహనాలతో రద్దీగా లైసెన్స్ లేకుండా వేగంతో నడుపుతున్నారని, కాలువపల్లి వైఎస్సార్ డ్యామ్, గంగన్న శిరస్సు, కేటల్ ఫామ్ డ్యామ్, కైగల్ జలపాతం వంటి నీటి ప్రవాహాలు ఉన్నచోట షార్ట్ వీడియోల కోసం యువత ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారన్నారు. యువతకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ సభ్యులతోపాటు జిల్లా సీనియర్ ఉపాధ్యక్షులు సుభాన్ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ హరినాథ్‌రెడ్డి తకిఖీ చేశారు. ఆరోగ్య సిబ్బందికి తగు సూచనలు చేసిన అనంతరం మందుల నిల్వలు తనిఖీ చేశారు. 108,104 వాహనాలు సిద్ధంగా ఉంచాలని.. తుపాన్ కారణంగా ఎప్పటికప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయచందర్, డాక్టర్ షాలిని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ పీసీసీ నూతన అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి వెళ్లి పీసీసీ మెంబర్ పోటుగారి భాస్కర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిడుగు రుద్రరాజు నాయకత్వంలో 2024 లో జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి సైనికుల్లా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో వెదురుకుప్పం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కందుకూరి హుమేష్, జిల్లా కార్యదర్శి కన్నన్, జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి రాణియాదవ్ పాల్గొన్నారు.

లంపీ వ్యాధితో పాడిఆవు మృతి

ప్రజాశక్తి-కార్వేటినగరం: లంపీ వ్యాధితో మండల పరిధిలోని కొటార్వేడు గుండ్ల దళితవాడలోని లతకు చెందిన పాడి ఆవు శనివారం మృతి చెందింది. జీవనాధారం కోసం రూ.55 వేలు వెచ్చించి పాడి ఆవును కొనుగోలు చేశామని. వారం రోజులుగా లంపీ చర్మవ్యాధితో బాధపడుతూ ఉండటంతో వైద్యులు వైద్యసేవలు అందించారు. అయితే వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో మతి చెందింది. పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలని, చర్మంపై గడ్డలు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే పశువైద్యుల దష్టికి తీసుకెళ్లి వైద్యం చేయించాలని వైద్యనిపుణులు సూచించారు.

మాండూస్ బాధితులకు పునరావాసం

ప్రజాశక్తి-కార్వేటినగరం: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన మాండూస్ తుపాన్ ప్రభావంతో సుద్దగుంట ఏఏడబ్ల్యూ గ్రామంలో ఉరుస్తున్న ఇళ్లను తహసీల్దార్ అమర్‌నాథ్, ఎంపీడీవో మోహన మురళీ గుర్తించి వారికి స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పునరావాసం కల్పించారు. వారికి భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గత 40 సంవత్సరాల క్రితం నిర్మాణం చేపట్టిన పక్కాగహాలు శిథిలావస్థకు చేరుకున్నాయని.. తుపాన్ ప్రభావం తీవ్రం కావడంతో అన్ని గహాలు ఉరుస్తున్నాయన్నారు. ఇబ్బందులు పడకుండా సురక్షిత ప్రాంతానికి తరలించడం జరిగిందన్నారు. మండలంలో ఎక్కడైనా ఇలాంటి పరిస్థితులు ఉన్నట్లయితే కార్యదర్శులు గుర్తించి తమ దష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయనతో ఈవోపీఆర్ లక్ష్మీపతి, వలంటీర్లు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండలంలోని వీరకనెల్లూరు దళితవాడకు చెందిన గ్రీన్ అంబాసిడర్ కుప్పయ్య పూరిల్లు గోడలు పడిపోయాయి. అలాగే మండలంలోని తూగుండ్రం గ్రామానికి చెందిన టైలర్ నరసింహులుశెట్టి ఇంట్లోకి వర్షపునీరు రావడంతో అవస్థలు పడ్డారు. తహసీల్దారు ఇన్బనాథన్, ఎంపీడీవో శ్రీదేవి రెండు రోజులుగా ఆయా పంచాయతీలోని సచివాలయం అధికారులతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సూచనలు చేస్తున్నారు.

గంగాధరనెల్లూరులోని వీరకనెల్లూరు దళితవాడలో...

చౌడేపల్లె : బంగాళాఖాతంలో ఏర్పడిన మాండూస్ తుపాన్ ప్రభావంతో చిత్తూరు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కావడంతో అధికారులు ఆ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా చౌడేపల్లి మండలంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మాధవరాజు సూచించారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం స్థానిక ఎస్సీ కాలనీలో సహకార కేంద్ర బ్యాంక్ ఉద్యోగులు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు , అంబేద్కర్ భవన వ్యవస్థాపక అధ్యక్షులు బ్యాంక్ రెడ్డెప్ప ప్రజలకు తుపాన్‌పై అవగాహన కల్పించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మరో రెండు రోజులపాటు తుపాన్ ప్రభావం ఉన్న నేపథ్యంలో ఇబ్బంది పడేవారికి అంబేద్కర్ భవన్‌లో పునరావాసం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాత్రికి అక్కడే భోజనం, ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనల మేరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో శేఖర్, శంకర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సోమల: తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షంతో మండలంలో అధిక శాతం చెరువులు కుంటలు పూర్తిస్థాయిలో నిండి మొరవలు పోతున్నాయి. రైతులు జాగ్రత్తలు పాటిస్తూ పొలాల వద్దకు వెళ్లాలని చెరువు కింద వంకల వద్ద వ్యవసాయం చేసే రైతులు నీటి ప్రవాహన్ని దాటే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచనలు ఇస్తున్నారు. ముఖ్యంగా పిల్లలను వాగులు, వంకల వద్దకు పంపకుండా తల్లిదండ్రులను హెచ్చరిస్తున్నారు.

సోమలలో వాగుల వద్ద గొర్రెలను దాటిస్తున్న కాపరులు

ఏప్రిల్‌లో ఐఎఫ్‌టియు జాతీయ మహాసభలు

- జాతీయస్థాయిలో కీలక ఉద్యమాలకు కార్యాచరణ రూపకల్పన
- రాష్ట్ర అధ్యక్షులు పి. ప్రసాద్ వెల్లడి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఐఎఫ్‌టియు జాతీయ మహాసభలు 2023 ఏప్రిల్ 16, 17, 18 తేదీలలో మూడు రోజులపాటు తిరుపతిలో జరగను న్నాయని ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్ చెప్పారు. శనివారం తిరుపతిలోని నారాయణపురం లోని కార్యాలయంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో కార్మిక, రైతు, ఉద్యోగులపై తీవ్రస్థాయిలో దాడులు జరుగుతున్నాయని వివరించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పాత కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని, రైతు వ్యతిరేక చట్టాలను బలవంతంగా అమలు చేయడానికి ప్రయత్నించిందన్నారు. ఈ నేపథ్యంలో శ్రామిక వర్గం మరింత చైతన్యవంతంగా వ్యవహరించి భవిష్యత్తులో కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలను నివారించడానికి కృషి చేయాల్సిన కీలక బాధ్యత ఉంద న్నారు. ఈ నేపథ్యంలో ఐఫ్టియు జాతీయ మహాసభలు జయప్రదం చేయడానికి సన్నాహక ఏర్పాట్లపై రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. స్కీం వర్కర్లకు ఇచ్చిన హామీలను పెన్షనర్లకు అలాగే ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీలను సీఎం అమలు చేయాలని హరికృష్ణ డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మిక వర్గం ఆగ్రహాన్ని చవిచూడక తప్పదని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఐఫ్టియు ప్రధాన కార్యదర్శి పోలారి కూడా పాల్గొన్నారు

వర్షంతో ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాండూస్ తుఫాను హెచ్చరికల నేపథ్యంలో స్థానిక పంచాయతీ పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చర్యలు చేపట్టామని తిరుమల నగర్ పంచాయతీ వైసీపీ ఇన్‌చార్జి గుండ్రాజు శివశంకర్ రాజు తెలిపారు. శనివారం తిరుమల నగర్ పంచాయతీ పరిధిలోని కేబీఆర్ నగర్(డ్రైవర్ క్వార్టర్స్)లో లోతట్టు ప్రాంతం కావడంతో సమీపంలోని చెన్నాయిగుంట కాలువ నుండి అధిక వర్షాలు కురిసినపుడు వర్షపు నీరు పోటెత్తి కాలనిలోకి ప్రవేశిస్తుంది. వర్షపు నీరు కాలనీ నుండి బయటకు ఇబ్బందులు లేకుండా వెళ్లేలా జెసీబీ సాయంతో ముళ్ల కంపల చెట్లను తొలగించామన్నారు. స్థానిక విఆర్వో భూపతి మాట్లాడుతూ తిరుపతి అర్బన్ తహశీల్దార్ వెంకటరమణ ఆదేశాలతో మంగళం పరిధిలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించడం జరిగిందన్నారు. తుఫాను వలన మంగళం పరిధిలో ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదని తెలిపారు.

వర్షపునీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ప్రతిఒక్కరూ మానవ హక్కులకు ప్రాధాన్యతివ్వాలి

ప్రిన్సిపల్ భువనేశ్వరి దేవి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమం లో భాగంగా ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి అధ్యక్షతన కళాశాల అధ్యాపకులచేత, విద్యార్థినుల చేత, అధ్యాపకేతర బృందం చేత తిరుమల తిరుపతి దేవస్థానం ఆదేశాను సారం మానవ హక్కుల వాగ్దానం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ సెట్విన్ కన్వీనర్ మురళీకృష్ణ మాట్లాడుతూ చెడపకురా చెడేవు అంటూ, మానవ హక్కుల ద్వారా ఉన్నత పదవులు పొందే అవకాశం భారతదేశం కల్పించిందని అన్నారు. కళాశాల అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులు, ఎన్ ఎస్ ఎస్ వాలంటరీస్, ఎన్ సి సి క్యాడెట్స్ పాల్గొని కార్యక్రమాన్ని జాతీయ గీతంతో ముగించారు.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో..

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని మానవ హక్కులు, సామాజిక అభివృద్ధి విభాగం, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, ఆకాంక్ష ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం హెడ్ అండ్ ప్రిన్సిపాల్ ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ఆచార్య జి పద్మనాభం అధ్యక్షతన విశ్వవిద్యాలయంలోని సెనేట్ హాల్ నందు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రెక్టార్ ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మానవ హక్కుల ప్రాధాన్యత గూర్చి పిల్లలకు తల్లిదండ్రులు తెలియజేశారు.

రేణిగుంట: కులమత భాషలకు అతీతంగా జీవించడమే మనవహక్కుల ఉద్దేశమని ప్రముఖ న్యాయవాది, జాతీయ మానవ హక్కుల సంస్థ ఏపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని వెదల్లచెరువు గ్రామంలోని ఎస్టి కాలనీలో మానవ హక్కుల దినోత్సవాన్ని ఉదయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. వెదుళ్ళ చెరువు గ్రామంలోని గిరిజనులకు ఉదయ్ కుమార్ రెడ్డి మానవ హక్కుల గురుంచి తెలియజేసారు. సుబ్రహ్మణ్యం, గంగయ్య, సరస్వతి, అర్జున్, రాజ, చెంచయ్య, లక్ష్మయ్య పాల్గున్నారు.

శ్రీకాళహస్తి : ప్రతి ఒక్కరూ మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది రమేష్ బాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని బీసీ బాలిక హాస్టల్లో శనివారం న్యాయ సలహా మండలి ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవ హక్కులపై అవగాహన కల్పించారు. మహిళలపై లైంగిక వేధింపుల నిర్మూలన, దిశ యాప్, మహిళా సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. సాయం కోసం 15100 నంబర్ కు కాల్ చేయాలని కోరారు. వార్డెన్ విజయకుమారి పాల్గొన్నారు.

ఉమ్మడి పౌరసత్వ బిల్లు దేశానికి ముప్పు

- బిల్లుపై జగన్ నోరు విప్పాలి
- గవర్నర్ వ్యవస్థకు వ్యతిరేకంగా 29న దేశవ్యాప్త ఆందోళన
- బిజెపి వ్యతిరేక కుటుంబంలోకి కేసీఆర్ రావాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

పార్లమెంటులో ప్రతిపక్షాల వ్యతిరేకించినప్పటికీ ఉమ్మడి పౌరసత్వ బిల్లును ప్రైవేటు బిల్లుగా బిజెపి సభ్యుడు రాజ్యసభలో ప్రవేశ పెట్టడం మోడీ నియంతత్వానికి నిదర్శనం అని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ పేర్కొన్నారు. ఉమ్మడి పౌరసత్వ బిల్లు అమలు జరిగితే దేశానికే ప్రమాదం ఏర్పడుతుందని చెప్పారు. శనివారం తిరుపతి సిపిఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత దేశంలో మోడీ తీసుకుంటున్న నిర్ణయాలతో లౌకిక వాదం, ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం తప్పదు అన్నారు. ఉమ్మడి పౌరసత్వ బిల్లుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తన వైఖరి ఏమిటో తక్షణం వెల్లడించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ బిల్లుపై తన పార్టీ పార్లమెంటు సభ్యులకు ఏమి సూచన చేశారో చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని జాతీయ పార్టీగా కెసిఆర్ ఏర్పాటు చేయడాన్ని తాము స్వాగతిస్తున్నాము అన్నారు. అయితే బిజెపి ని కేంద్రంలో సాగనంపాలంటే బిజెపి వ్యతిరేక కూటమిలో కెసిఆర్ భాగస్వామ్యం కావాలన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన మహా పాదయాత్రకు అనూహ్య స్పందన లభించింది అన్నారు. తుఫాను కారణంగా శనివారం నుండి కొనసాగాల్సిన పాదయాత్ర రద్దు చేసుకోవాల్సి వచ్చిందన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం చలో రాయలసీమ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం అన్నారు. గవర్నర్ల వ్యవస్థ కేంద్రానికి దళారీ వ్యవస్థగా మారిందన్నారు. రాష్ట్రపతి కంటే ముందు ప్రధాని, హోం మంత్రి లకు సమాచారం చేరవేస్తూ ప్రజాస్వామ్యాన్ని అప హాస్యం చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలకు ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. 29వ తేదీన గవర్నర్ల వ్యవస్థకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతున్నాం అన్నారు. ఫిబ్రవరి 24 నుండి పాండిచ్చేరిలో సిపిఐ జాతీయ సమితి సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామా నాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకష్ణ, నదియా, నగర కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఎస్‌డీఆర్‌ఎఫ్ సభ్యులచే సేవలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలంలో మాండూస్ తుపాన్‌తో ఎలాంటి అనివార్య సంఘటనలు జరిగితే తామున్నామని ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు సద్దాం, తీర్థం, పటాన్, మొహమ్మద్‌యాసిన్, బసవరాజు, జగదీశ్, బెలుపల్లి బాలాజీ, శ్రీనివాస్ తేజ్ తెలిపారు. ఆపద సమయాల్లో తమకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఫోన్‌నంబర్లు 8096467790, 8309127600, 8499802442, 9100244994, 8096461475, 7093651018 లను సంప్రదించాలని కోరారు.

బియ్యం, సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని రొటరీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం 33 మంది నిరుపేద వృద్ధులకు నెలకు సరిపడా బియ్యం, ఫలసరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కిరణ్ చక్రవర్తి, కార్యదర్శి రవికుమార్, సీనియర్ రోటేరియన్లు బి.దశరథ రామ్ రెడ్డి, మయూరి శ్యామ్ యాదవ్, పి.వి. కృష్ణయ్య, జి.జి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుదువ దుకాణంలో చోరీ

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి పట్టణం లోని ఓ కుదువ దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఎల్వీ పాన్ బ్రోకర్స్ కుదువ వ్యాపార దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో వెనుక వైపు నుంచి గోడకు రంధ్రం వేసి దుకాణంలోకి వెళ్లి బంగారు నగలు చోరీ చేసుకెళ్లారు. వెంకటగిరి సీఐ, ఎస్సైలు, క్లూజ్ టీమ్ చేరుకుని వివరాలు సేకరించారు.

13న వాహనాలకు వేలం

ప్రజాశక్తి-చౌడేపల్లె : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 13న మంగళవారం పుంగనూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు చౌడేపల్లె ఎస్.ఐ.రవికుమార్ పేర్కొన్నారు. వివరాలకు చౌడేపల్లి పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని ఎస్.ఐ తెలిపారు.

దుప్పట్ల వితరణ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: తిరుమలయ్యపల్లి పంచాయితీ శికారు కాలనీలో ఉంటున్న 40 కుటుంబాల వారికి చక్రధర సిద్ధాంతి, కర్ణాటక ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సద్భార్ కిర్మాణి వారి సౌజన్యంతో శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. తుపాన్ కారణంగా జాగ్రత్తలు తెలిపారు.

సభ్యత్వ సర్టిఫికెట్ల అందజేత



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ కార్యాలయంలో జరిగిన ల్యాబ్ టెక్నిషియన్స్ సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష తిరుపతి ల్యాబ్ టెక్నిషియన్స్‌కు అసోసియేషన్ సభ్యత్వ సర్టిఫికెట్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ ఆర్.శిరీష మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసుకున్న ల్యాబ్ టెక్నిషియన్స్ అసోసియేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లాలని తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని మేయర్ స్పష్టం చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.హరి, సలహాదారులు శ్రీకాంత్, సభ్యులు జోయెల్ ప్రశాంత్, నరేంద్ర, అశోక్, విజయ్ కుమార్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అపార నష్టం

ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మండలం లోని పలు గ్రామాల్లో తుపాన్ కారణంగా పంటలు నీట మునిగి, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం సుమారు 900 ఎకరాల్లో వరి నాట్లు ఉండగా.. వందల ఎకరాల్లో పంట నీట మునిగింది. అంతే కాకుండా మిరప, కూరగా యల పంటలు సుమారు వందల ఎకరాల్లో సాగు చేస్తున్న వారు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం సాయం అందించాలని కోరుతున్నారు. తహశీల్దారు జయజయ రావు, ఎస్సై మనోజ్ కుమార్ , ఏవో ప్రవీణ సిబ్బందితో కలిసి పలు గ్రామాల్లో పరిశీలించారు.

సోమల: మండలంలో తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. చెరకు, వరి, టమోటా పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది.

రాష్ట్ర త్రోబాల్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి

ప్రజాశక్తి-గుడిపల్లి: గుడిపల్లి మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి గోవర్ధన్ కుప్పం ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన త్రో బాల్ పోటీలలో విజయం సాధించి రాష్ట్ర పోటీలకు ఎన్నికయ్యాడు. ఈనెల కడప జిల్లాలోని కమలాపురంలో 17, 18, 19వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ప్రాజెక్ట్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలో నిర్మిస్తున్న బడబళ్ళవంక ప్రాజెక్టు పనులను చిత్తూరు ఆర్డీవో రేణుక శనివారం పరిశీలించారు. మండలంలోని పెద్దగొట్టిగల్లు గ్రామపంచాయతీలో సుమారు రూ.15 కోట్లతో ప్రాజెక్టు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పనులను ఆర్డీవో పరిశీలించి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మురాషావలి, ఎంపీడీవో రాజేంద్ర, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ ఖాదర్, వీఆర్వో లు ముబారక్, శ్రీనివాసులు, మండల సర్వేయర్ సులోచన, గ్రామ సచివాలయ సర్వేయర్ మానస తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి : పార్థసారథి రెడ్డి

ప్రజాశక్తి- నాయుడుపేట: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శుక్రవారం ఉదయం నుంచి నాయుడుపేటలోని కొన్ని లోతట్టు ప్రాంతాలు ప్రజలు కొంత ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నారు. భారీ ఈదురు గాలులతో వర్షం బీభత్సం సృష్టించినప్పటికి నాయుడుపేట మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, నాయుడుపేట తహశీల్దార్ ఏ.రాజేంద్రలు వారి వారి సిబ్బందితో కలసి ప్రజలను ముందుగానే అప్రమత్తం చేశారు. పట్టణంలో కొన్ని లోతట్టు ప్రాంతాలైన లోతువానిగుంట, సంజయ్ గాంధీ కాలనీ, బీడీ కాలనీ, ఎల్ఏ సాగరం ఎస్టీ కాలనీల వంటి స్వర్ణముఖి నది తీరాన గల నీరు నిలబడే ప్రాంతాలలో మోటర్లు పెట్టి వర్షపు నీటిని తొలగించారు. ఈ క్రమంలో నాయుడుపేట సీనియర్ లాయర్ వెందోటి పార్థసారథిరెడ్డి వర్షాల వల్ల ఆయన పడుతున్న ఇబ్బందులను తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డికి లేఖ తెలియజేసారు. ఈ లేఖను కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే కిలివేటి. సంజీవయ్యకు, పురపాలక శాఖ మంత్రికి పంపమని తెలిపారు.

నీట మునిగిన విద్యుత్ కార్యాలయం

ప్రజాశక్తి-కోట : మండలంలోని సబ్ డివిజనల్ విద్యుత్ కార్యాలయంలో పూర్తిగా వర్షపు నీటిలో మునిగింది. దీంతో విద్యుత్ అధికారులు, సిబ్బంది విధులకు హాజరు కావాలంటే వర్ణనాతీతం అని చెప్పవచ్చు. అయితే విద్యానగర్ లోని సబ్ డివిజనల్ కార్యాలయంలో వర్షపు నీరు చేరడం ఇది క్రొత్త కాదు,ప్రతిఏడాది ఇదే సమస్య ఏర్పడుతుంది.విద్యుత్ కస్టమర్లు మాత్రం దీనికి పరిష్కార మార్గం లేదా అని వాపోతున్నారు.విద్యుత్ పనులపై విద్యుత్ కార్యాలయానికి వచ్చిపోయే వారు నరకయాతన పడుతున్నారు.ఇప్పటికైనా విద్యుత్ అధికారులు శాశ్వత పరిష్కార మార్గం ఏర్పాటు చేసి విద్యుత్ కస్టమర్లకు సహకరించాలని కోరుతున్నారు.

నీటమునిగిన గ్రామాలను సందర్శించిన తహశీల్దార్

రేణిగుంట : మండలంలోని పలుచోట్ల గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు నీటితో మునిగాయి. అనేకచోట్ల గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అందులో భాగంగా రేణిగుంట మండలం ఆత్తూరు పంచాయతీలో వంతెన మీదకు వర్షపు నీళ్లు రావడంతో ఆ గ్రామంలోని రాకపోకలు చేయకూడదని తహశీల్దార్ శివప్రసాద్ అన్నారు. ఏమైనా అత్యవసరాలకు తమ నంబర్లను 9491077043ను సంప్రదించాలని కోరారు.

వర్షంలోనూ జేసీబీతో రోడ్డు పనులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: కురిసిన భారీ వర్షాల కారణంగా వడమాలపేట మండల పరిధిలోని శ్రీ బొమ్మరాజపురం గ్రామంలో ఎస్టీ కాలనీకి వెళ్లే మార్గంలో ఈదురుగాలులతో టేకు చెట్లు కరెంటు స్తంభాలపై పడి గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వెంటనే సర్పంచ్ మణిరాజు స్పందించి బీసీ కాలనీలో జేసీబీతో రోడ్డు పనులు చేయించారు. ఈ నేపథ్యంలో ఎగువ నుంచి వచ్చే వరద నీరు కాలువ ద్వారా ఉద్రిక్తంగా రావడంతో గ్రామస్థులు, రైతులు, కూలీలు, పాడి పశువులను జాగ్రత్తగా ఇంటి వద్ద ఉంచి మేత వేయాలని సూచించారు. ముంపునకు గురవుతున్న ఆది ఆంధ్ర వాడలో పర్యటించి వర్షాల కారణంగా చెరువు నీరు వచ్చే అవకాశం ఉందని .. అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవి, శివ, యాయతి, చిన్న, గెడ్డం మాతయ్య, బాలరాజు, సురేష్, సాయి పాల్గొన్నారు.

సరికొత్త ఆలోచనలు పెంచుకోవాలి

కులసచివులు ఆచార్య డిఎమ్. మమత

ప్రజాశక్తి - క్యాంపస్ : ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా మహిళా విశ్వ విద్యాలయంలో జరిగిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఆదివారం సావేరీ అతిథి గృహంలో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వర్సిటీ కులసచివులు ఆచార్య డిఎమ్. మమత మాట్లాడుతూ క్రియేటివ్ థింకింగ్, కొలాబరేటివ్ థింకింగ్ ఆవశ్యకతను తెలియజేస్తూ కార్బన్ న్యూట్రాలిక్‌ను గూర్చి వివరించి, రెడ్యూస్ రికవర్ అండ్ రీసైకిల్ పాలసీని గూర్చి గుర్తు చేస్తూ ప్రతి వ్యక్తి తాను అందుకున్న విజ్ఞానాన్ని అందరికీ పంచాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న అధ్యాపకులు 46 మంది పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనర్ దినకర్ రెడ్డి అందించిన ఆసక్తికరమైన ఉపన్యాసాలు అధ్యాపకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ రిలేషన్స్ మెంబర్స్ ప్రొఫెసర్ నిర్మల, ప్రొఫెసర్ ఉష, డాక్టర్ అనురాధ, టెక్నికల్ స్టాఫ్ భావన, పుష్ప పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో .. కాలిపోయిన కంప్యూటర్

ప్రజాశక్తి - గంగాధనెల్లూరు: మండలంలోని కాళేపల్లె సచివాలయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రింటర్, కంప్యూటర్ సీపీయూ కాలిపోయిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి .రిగింది. వరత్తూరు పంచాయతీ కాల్లేపల్లి సచివాలయంలో అధికారులు విధుల్లో ఉన్నారు. అయితే శుక్రవారం రాత్రి విద్యుత్ సరఫరా ఆగిపోయి కొంతసేపటికి రావడంతో సచివాలయంలోని ప్రింటర్, సీపీయూ కాలిపోయాయి. సమాచారాన్ని అధికారులకు చేరవేశారు. శనివారం జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీదేవి సచివాలయంలో జరిగిన అగ్నిప్రమాదాన్ని పరిశీలించారు.